# పరిశుభ్ర

# తిరుపతి

- స్వచ్ఛ సర్వేక్షణ్‌లో స్థానం కోసం ఏర్పాట్లు ముమ్మరం
- యంత్రాంగంతో పాటు ప్రజలూ సన్నద్ధం కావాలి
- పారిశుధ్య పనులపై అవగాహన పెంచుకోవాలి
- మరింత సమర్థంగా తడి, పొడి చెత్త సేకరణ
- కార్పొరేషన్ నిధులతో సీఎన్‌డీ ప్లాంట్ నిర్మిస్తాం
- ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో కమిషనర్ వినయ్‌చంద్

వివరాలు 6లో..



ఆంధ్రజ్యోతి Thu, 28 July 2016
epaper.andhrajyothy.com/c/

# స్వచ్ఛ సర్వేక్షణ్‌లో స్థానమే లక్ష్యం

- అధికార యంత్రాంగంతో పాటు ప్రజలూ సన్నద్ధం కావాలి
- ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో కమిషనర్ వినయ్‌చంద్

**తిరుపతి నగరం:** స్మార్ట్‌సిటీ మిషన్, స్వచ్ఛ సర్వేక్షణ్...ఈ రెండు పథకాల్లోనూ తిరుపతిని అత్యుత్తమ నగరంగా నిలపాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ వాడరేవు వినయ్‌చంద్ అన్నారు. స్మార్ట్‌సిటీస్ తొలి విడత టాప్ 20లో నిలవలేకపోయినా రెండో విడత తప్పకుండా ఆకర్షణీయ నగరాల జాబితాలో నిలుస్తామన్న ధీమా వ్యక్తం చేస్తున్నారు. రెండో విడత టాప్ 40లో స్థానం కోసం ప్రణాళికలు సమర్పించి...ఫలితం కోసం ఎదురు చూస్తున్నామని తెలిపారు. కొత్తగా స్వచ్ఛ సర్వేక్షణ్ నగరాల జాబితాలో క్లీనెస్ట్ సిటీగా నిలపడం కోసం ఏర్పాట్లు సిద్ధం  చేస్తున్నట్టు చెప్పారు. క్లీన్‌సిటీగా, స్మార్ట్‌సిటీగా నిలిపి తిరునగరికి ఆధునిక నగరంగా బ్రాండ్ ఇమేజ్ తెస్తామన్న ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు తాము చేస్తున్న కసరత్తు వివరాలను ఆంధ్రజ్యోతితో వినయ్‌చంద్ పంచుకున్నారు.



### 500 నగరాల మధ్య పోటీ

సర్వేక్షణ్ అంటే సర్వే చేయడమే. పారిశుధ్య పనులు ఎలా వున్నాయో కేంద్రం ప్రత్యేక బృందాల ద్వారా సర్వే చేయిస్తుంది. మార్గదర్శకాలకు అనుగుణంగా నగరాలు పరిశుభ్రతా పనులు కొనసాగుతున్నదీ లేనిదీ గుర్తిస్తుంది. ఉత్తమ విధానాలను అనుసరిస్తున్న వాటికి ర్యాంకింగ్ ఇస్తుంది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 500 నగరాల మధ్య పోటీ నిర్వహించనుంది. స్మార్ట్‌సిటీ తరహాలో స్వచ్ఛ సర్వేక్షణలోనూ తిరుపతి పోటీ పడుతోంది. ప్రథమ స్థానంలో తిరుపతిని నిలపాలన్న లక్ష్యంతో శ్రమిస్తున్నాం. 2017 జనవరి తొలి వారం నుంచే స్వచ్ఛ సర్వేక్షణ్ ఎంపిక ప్రక్రియ ఆరంభమవుతుంది. పోటీల్లో నిలిచి,గెలవాలంటే ఇప్పటినుంచి యంత్రాంగంతో పాటు ప్రజలు సన్నద్ధం కావాలి. క్లీన్ సిటీగా నిలవాలంటే ఒక విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. ప్రపంచ దేశాలన్నీ పారిశుధ్య పనులకు అధిక ప్రాధాన్యతను ఇస్తాయి. ఆ దేశాలను కూడా ఆకర్షించాలి.ఈ ప్రయాణంలో తిరుపతి ప్రజల సహకారం చాలా అవసరం. వారి ఆలోచనా విధానాల్లో మార్పు రావాలి. పారిశుధ్య పనులపై అవగాహన పెంచుకోవాలి.అంతకంటే మునుపు సిబ్బందినీ సన్నద్ధం చేస్తున్నాం.

స్వచ్ఛ సర్వేక్షణ్ నిబంధనలు అలాంటివి మరి. సర్వే విధానంలోనే ర్యాంకింగ్ వస్తుంది. వంద వరకు కొలమానాలతో 2000 మార్కులకు పోటీ వుంటుంది. చెత్త ఊడ్చడం, తడిచెత్త పొడి చెత్తను విడిగా చెత్తను సేకరించడం, కంపోస్టు యార్డులకు తరలించడం, దశల వారీ నిర్వహణ ప్రక్రియ, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్వహణ, సామూహిక-పబ్లిక్ టాయ్‌లెట్ల నిర్వహణ, బహిరంగ మూత్ర, మలబద్ధ విసర్జనను నియంత్రించడానికి అనుసరిస్తున్న ప్రణాళికలు, మానవ వనరులు, యాంత్రిక వనరులు,సాంకేతిక పరిజ్ఞాన సద్వినియోగం వంటి వంద కొలమానాల ఆధారంగా మార్కులను కేటాయిస్తాయి. ఇందులో ఆయా నగరపాలక సంస్థలు సమర్పించే డేటా ఆధారంగా 900 మార్కులు వుంటాయి. కేంద్రం ఇండిపెండెంట్‌గా నిర్వహించే సర్వే ద్వారా 600 మార్కులు ఇస్తుంది.ఆయా నగరాల్లోని పాయింట్ ఒక్క శాతం జనాభా  లేదంటే వెయ్యి మందితో...ఇందులో ఏ సంఖ్య తక్కువైతే అంత మందితో శాంపిల్ సర్వే చేసి, మరో 500 మార్కులను కేటాయిస్తుంది. అందువల్ల అలాంటి కొలమానాలను పరిగణనలోకి తీసుకుంటున్నాం. ఇప్పటి నుంచే సన్నద్ధం అవుతున్నాం. పారిశుధ్య సిబ్బంది హాజరును బయోమెట్రిక్, ఐరిష్ విధానాల కిందకు తెచ్చాం. నగరపాలక సంస్థకు చెందిన 73వాహనాల కదలికను చాంబర్‌లో కూర్చుని సిస్టమ్‌లో పరిశీలించేలా సాంకేతిక విధానాన్ని ప్రవేశపెట్టాం. ఇలాంటి అంశాలు ఎంపిక ప్రక్రియలో దోహదపడతాయి. ఇంటింటికీ వెళ్లి తడి,పొడి చెత్తని సేకరించే ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేస్తాం. హోటళ్లు, రెస్టారెంట్లు ఇప్పటి దాకా చెత్తను వేరుచేయడం లేదు. కానీ ఇక మీదట అలా కుదరదు. తడిచెత్త, పొడిచెత్తను విడిగా తీసుకునేలా నిబంధనలను కఠినతరం చేస్తున్నాం.ప్రైవేటు భాగస్వామ్యంతో సీఎన్‌డీ వేస్ట్ ప్లాంట్లకు అవకాశం కల్పిస్తాం. వాటితో పాటు  ఏడాది ఆఖరులోపు నగరపాలక సంస్థ సొంత నిధులతో ఒక్క ప్లాంట్‌ను నిర్మిస్తాం. బిల్డింగ్ వేస్ట్ మెటీరియల్‌ను రీసైక్లింగ్ ద్వారా సద్వినియోగం చేసుకోవడమే దీని ప్రధాన లక్ష్యం. మంగళం రోడ్డు, న్యూఇందిరానగర్ వంటి ప్రాంతాల్లో బిల్డింగ్ వేస్ట్ మెటీరియల్‌ను డంప్ చేస్తున్నట్టు గుర్తించాం. సిమెంటు, ఇటుక దిమ్మెలను పొడి చేసి, రోడ్లను ఆధునీకరించడానికి సద్వినియోగం చేసుకునే కొత్త సాంకేతిక పరిజ్ఞానమిది. చెన్నైలో ఈ విధానం సమర్థవంతంగా అమల్లో వుంది. ఈ విషయంలో చెన్నైకి సమగ్ర నివేదిక సమర్పించిన ప్రొఫెసర్ సత్యనారాయణ సహకారం తీసుకుంటున్నాం. చెన్నైలో రోజుకు 500 టన్నుల వేస్ట్ మెటీరియల్‌ను పొడిగా మార్చుతున్నారు. తిరుపతిలో కనీసం 50 టన్నుల వరకు పోగవుతున్నట్టు అంచనా. ఏడాది ఆఖరులోపు తిరుపతి నగరంలో సీఎన్‌డీ వేస్ట్ ప్లాంట్ అందుబాటులోకి వస్తుంది. టోల్ ఫ్రీ నెంబరును కేటాయించడం ద్వారా నగరంలో వ్యక్తిగతంగా కూడా బిల్డర్ల దగ్గర నుంచి బిల్డింగ్ వేస్ట్ మెటీరియల్‌ను సేకరిస్తాం. ఫోన్ చేసిన వెంటనే బిల్డర్ ఇంటికే ట్రక్కులు పంపుతాం.నగర రోడ్లపై చెత్త, బిల్డింగ్ వేస్ట్ మెటీరియల్‌ను పడేయడం వల్ల పారిశుధ్య పనులు లోపించినట్టే పరిగణించాల్సి వస్తుంది. స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో ఇదొక ముఖ్యమైన కొలమానం కావడం వల్ల సీఎన్‌డీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం అనివార్యమైంది.

ఆంధ్రజ్యోతి Thu, 28 July 2016
epaper.andhrajyothy.com/c/12096295